సాక్షి
వికారాబాద్
బుధవారం ॥ 12 ॥ ఫిబ్రవరి ॥ 2025



షాపులో అగ్ని ప్రమాదం

సోఫా రిపేర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. 8లో▸



ఆర్‌ఓల పాత్ర కీలకం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్‌ఓలు కీలకమని తాండూరు డివిజన్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. 8లో▸



ప్రణాళిక బద్ధంగా చదవాలి

ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు లగచర్ల రైతులతో సమావేశం

కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: వికారాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో గురు వారం దుద్యాల మండలం లగచర్ల రైతులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం నిర్ణయించేందుకు మధ్యాహ్నం 1.30 గంటలకు లగచర్ల శివారు సర్వే నంబర్లు 102, 117, 120, 121 అసైన్డ్ భూమి రైతులు హాజరవ్వాలన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం వికారాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ విధులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది నియామకంపై అభ్యంతరం

సవరణ కోరుతూ సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

తాండూరు టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల సిబ్బంది నియామకం తప్పులతడకగా ఉందని పలువురు తపస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం సిబ్బంది నియామకాన్ని సవరించాలని కోరుతూ తాండూరు సబ్-కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తపస్ నాయకులు మాట్లాడుతూ.. స్టేజ్-2 అధికారులను వారు పనిచేసే పంచాయతీలకు బదులుగా వేరే పంచాయతీలకు కేటాయించాలని.. స్కూల్ అసిస్టెంట్లనే స్టేజ్-2 అధికారులుగా నియమించాలని కోరారు. ఆర్వో-2 అధికారులుగా అన్ని పాఠశాలల్లో పని చేసే స్కూల్ అసిస్టెంట్లను సమానంగా నియమించాలన్నారు. స్టేజ్-1, ఆర్వో, ఏఆర్వోలుగా ఒక చోట నియమించబడిన పలువురిని స్టేజ్-2 అధికారులుగా నియమించడం సరికాదన్నారు. వారిని మినహాయించి కొత్త వారిని నియమించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తపస్ నాయకులు లక్ష్మీకాంత రావు, రవి, సంతోష్, ఆనంద్, బస్వరాజ్, శ్రీనివాస్ ఉన్నారు.

టీఎంహెచ్‌ఓసీఈయూ ఉపాధ్యక్షుడిగా నర్సింలు



నర్సింలుకు నియామకపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మర్పల్లి: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్(టీఎంహెచ్ఓసీఈయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సింలు నియమితులయ్యారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మంగళవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ.. తనకు ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి సుభాష్, కార్యదర్శి భిక్షపతికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

లోకల్ బాడీ.. గెట్ రెడీ!

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 227 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాలకు స్టేజ్-1, స్టేజ్-2 లో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలను నియమించారు. వారికి బుధవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించున్నారు.



- 'స్థానిక' ఎన్నికలకు సమాయత్తం
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 765 మంది రిటర్నింగ్ అధికారుల నియామకం
- నేటి నుంచి ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ
- రిజర్వేషన్ల గందరగోళం కారణంగా నోటిఫికేషన్ తాత్సారం

బషీరాబాద్: 'స్థానిక' సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. పల్లె పోరు ఎప్పుడు ప్రకటించినా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. నోటిఫికేషన్‌కు ముందే చేయాల్సిన అవసరమైన ప్రక్రియను ఇప్పటికే చక్కబెట్టిన అధికారులు ఓటరు జాబితా, బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బాక్సులు సిద్ధం చేశారు. సోమవారం రాత్రి కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే రిటర్నింగ్ అధికారుల జాబితాను సైతం విడుదల చేశారు. ఈ నెల 20లోపు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదలచేసే అవకాశం ఉండడంతో జిల్లా యంత్రాంగమంతా ఎన్నికల పనుల్లో తలమునకలయ్యారు.

రిజర్వేషన్ల గందరగోళం

జిల్లాలోని కొత్తగా చేరిన చౌడాపూర్, దుద్యాలతో కలిపి 20 మండలాలకుగాను 227 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో పంచాయతీల సంఖ్య 566 నుంచి 594కు చేరింది. ఈ పంచాయతీలకు సర్పంచ్‌లతో పాటు 5,058 వార్డులు ఉన్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజవర్గాలలోని 20 మండలాల్లో 6,98,974 మంది ఓటర్లు ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్‌లు, ఎస్సీ రిజర్వేషన్లపై ఇంకా తేల్చకపోవడంతో నోటిఫికేషన్ జారీలో తాత్సారం ఏర్పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో బీసీలకు 34 శాతం, ఎస్సీలకు 16, ఎస్టీలకు ఆరు శాతం రిజర్వేషన్లుండగా మిగిలినవి జనరల్ స్థానాలు ఉండేవి. కానీ బీసీ కులగణన తర్వాతా బీసీ రిజర్వేషన్‌లు 42శాతంగా ప్రభుత్వం తేల్చింది. అలాగే ఎస్సీల వర్గీకరణ జరగడంతో వారికి ఇచ్చే రిజర్వేషన్‌లపై సైతం గందరగోళం నెలకొనడంతో రిజర్వేషన్‌ల ప్రకటన ఆలస్యం అవుతోంది.

మొదట 'ప్రాదేశిక' ఎన్నికలే..!

లోకల్ బాడీలో మొదట పార్టీల గుర్తులపై జరిగే ప్రాదేశిక ఎన్నికలకే వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజల నాడీ తెలుసుకోవచ్చని అధికార పార్టీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగానే ప్రాదేశిక పోరుకు సిద్ధమవ్వాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సర్కారు నుంచి సంకేతాలు అందాయి. ఈ క్రమంలో పంచాయతీలతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికలకు సమానంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు తగిన సిబ్బందిని నియమించడంతో పాటు వారికి శిక్షణ ఇస్తుంది.

నేడు, రేపు శిక్షణ

ప్రాదేశికానికి, పంచాయతీలకు రిటర్నింగ్ అధికారులుగా గెజిటెడ్ హెచ్‌ఎంలను, హెచ్‌ఎంలను, స్కూల్ అసిస్టెంట్‌లను ఎంపిక చేశారు. ఇలా జిల్లాలో 171 స్టేజ్-1 లో ఆర్‌ఓలను, మరో 171 ఏఆర్‌ఓలను నియమించింది. స్టేజ్-2లో 597 మంది హెచ్‌ఎంలను, ఎస్ఏలను ఆర్‌ఓలుగా ఎంపిక చేశారు. వీరితో పాటు ప్రాదేశిక ఎన్నికల కోసం మూడు ఎంపీటీసీ స్థానాలకు ఒక ఆర్‌ఓ చొప్పున జిల్లాలో సుమారు 227 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాలకు గాను 90కి పైగా ఆర్‌ఓలను, ఏఆర్‌ఓలను నియమించారు. స్టేజ్-1లో బుధవారం పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల అధికారులకు ఉమ్మడిగా వికారాబాద్ ఐడీఓసీలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. స్టేజ్-2 కింద 597 ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు ఈ నెల 13న శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు.

లోకల్ బాడీ స్థానాల వివరాలు

నియోజకవర్గం	జీపీలు	ఎంపీటీసీ	జెడ్పీటీసీలు
వికారాబాద్	175	71	07
తాండూరు	149	53	04
పరిగి	157	59	05
కొడంగల్	113	44	04
మొత్తం	594	227	20



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించనున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులకు ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు ఉంటుందని వివరించారు. ప్రభుత్వ నిర్ణయానికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునిస్తూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులు, నాయకులు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీఓ వాసుచంద్ర, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, హఫీజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

బంట్వారం: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన కోట్‌పల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రూ 4.30 కోట్లతో సీసీ రోడ్లను ప్రారంభించి కొత్త వాటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. భూమి లేని నిరుపేద రైతులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదన్నారు. అంతకుముందు ఆయన కోట్‌పల్లి మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ వాహిద్, ప్రత్యేక అధికారి అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవులను రక్షించాలి

అటవీశాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్

అనంతగిరి: జిల్లాలోని అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులు సిబ్బందిపై ఉందని జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల రక్షణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో అటవీ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచుసుకునే అవకాశాలున్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను కాపాడాలన్నారు. 2025-26 వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవలని చెప్పారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్లు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



పోలేపల్లి ఎల్లమ్మ జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు

20 నుంచి ఎల్లమ్మ జాతర

సీఎం చేతుల మీదుగా ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దుద్యాల్: ఎలమ్మ దేవత బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. పోలేపల్లి గ్రామంలో వెలసిన ఎలమ్మ దేవత బ్రహ్మోత్సవాలను ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ముఖ్యమంత్రితో కలిసి ఆలయ ఈఓ రాజేందర్ రెడ్డి, చైర్మన్ జయరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతరకు రావాలని ముఖ్యమంత్రిని జాతరకు రావాలని ఆహ్వానించారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందిచారని, ఈ నెల 21న హాజరవుతానని చెప్పారని నాయకులు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మేడారం తర్వాత అంతటి పెద్ద జాతర పోలేపల్లి ఎల్లమ్మ అని అన్నారు. ఈ జాతరకు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని, ఇబ్బందులు కల్గకుండా వసతులు కల్పించాలని సూచించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, సంజీవ రెడ్డి, వెంకటయ్య, పులిందర్ రెడ్డి, సీసీ వెంకటయ్య పలువురు పార్టీ నాయకులు , కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలను సహించేది లేదు



రంగరాజన్‌తో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్: రామరాజ్యం పేరుతో అరాచాకాలు సాగిస్తే సహించేది లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావుతో కలిసి మంగళవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చిన ఆయన అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేవుని సేవ చేసే అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానవీయ ఘటనగా అభివర్ణించారు. దాడి చేసిన నిందితుల్లో కొందరిని ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, మిగతా వారిని సైతం అరెస్టు చేస్తామని చెప్పారు. చిలుకూరు బాలాజీ దేవాలయం వద్ద భద్రత పెంచుతామన్నారు. అంతకు ముందు ప్రధాన అర్చకుడు సౌందరరాజన్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. దేవుడిపేరు, రాముడి పేరు చెప్పి దాడులు చేయడం దురదృష్టకరమని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40% 'భరోసా' జమ



జిల్లా వ్యాప్తంగా రెండు ఎకరాలున్న వారికి రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌లో రూ.11.18 కోట్ల నిధులు జమచేయగా.. రెండు ఎకరాలు పూర్తయ్యే వరకు రూ.82.56 కోట్లు రైతుల ఖాతాల్లోకి చేరాయి.

- రెండు ఎకరాల వరకు సాగుసాయం
- 1,28,737 మంది అన్నదాతల ఖాతాల్లో రూ.82.56 కోట్లు
- వారానికి ఎకరం పెంచుతూ నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం

వికారాబాద్: ఎట్టకేలకు రైతుల ఎదురు చూపులు ఫలించాయి. ప్రజాప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుభరోసా పథకం ప్రారంభించారు. తొలుత మండలానికి ఓ గ్రామానికి పైలెట్ ప్రాజెక్ట్‌గా స్వీకరించి 27న జిల్లా వ్యాప్తంగా 20 గ్రామాల రైతులకు నగదు జమచేశారు. పైలెట్ ప్రాజెక్టులో జిల్లా వ్యాప్తంగా 8,609 మంది రైతుల ఖాతాల్లో రూ.11.18 కోట్లు నగదు జమచేశారు. వారం గ్యాప్‌తో ఒక ఎకరం వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు వేయగా.. సోమవారం ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో రెండెకరాల వరకు సాగుభూమి కలిగిన రైతులకు సైతం రైతు భరోసా డబ్బులు విడుదల చేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

40శాతం పూర్తి

రైతు ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా జమ చేస్తుండగా వారి సంఖ్యను బట్టి ఇప్పటి వరకు 40 శాతం పథకం పూర్తయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం రైతు భరోసాకు అర్హులైన రైతులు 3,12,872 మంది ఉండగా వీరికి 6,03,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక ఎకరం వరకు భూమి కలిగిన రైతులు 70,219 మంది రైతులుండగా.. ప్రభుత్వం వీరికి వారం క్రితం రూ.32.99 కోట్లు జమ చేసింది. తాజాగా సోమవారం రెండెకరాల వరకు భూమి ఉన్న 1,28,737 మంది రైతుల ఖాతాల్లో రూ.82.56 కోట్లు జమచేశారు.

మరో రెండు నెలలు..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పేరిట రైతుకు సాగు సాయం అందజేయగా.. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా అందజేస్తుంది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా సాగు పెట్టుబడులకు సాయం అందించకపోవడంతో రైతులు ఒకింత అసంతృప్తికి లోనయ్యారు. పథకం ప్రారంభించిన తర్వాత సైతం ఒక్కో ఎకరా చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వస్తోంది. ఎకరా, రెండు ఎకరాలకు నడుమ వారం రోజుల సమయం తీసుకుంటున్నారు. ఈ లెక్కన పది ఎకరాలు ఉన్న రైతులకు సాగు సాయం అందాలంటే మరో రెండు నెలల సమయం పడుతుందేమోనని రైతులు చర్చించుకుంటున్నారు. ఇదే జరిగితే వర్షాకాలం విత్తనాలు ప్రారంభించేనాటికి మొదటివిడత రైతు భరోసా పూర్తవుతుందని రైతులు భావిస్తున్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్



తాలూక స్థాయి సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

పరిగి: గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ తాలూక స్థాయి జయంతి వేడుకలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో గిరిజన సంఘం తాలూక స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి 15 వరకు సేవాలాల్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పరిగి తాలూక స్థాయి వేడుకలను చౌడాపూర్ మండలం మక్తవెంకటపూర్‌తండాలో నిర్వహిస్తామన్నారు. 15న నిర్వహించే ఉత్సవాల్లో ఉద్యోగస్తులు తప్పక పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంతూఓ హరిశ్చందర్, తౌర్యానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, శ్రీను, శాంతిబాయి, విఠల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్కెట్ అభివృద్ధికి సమష్టి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

నవాబుపేట: మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో ముందుకెళ్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్, వైస్ చైర్మన్ బల్వంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో త్వరలోనే మార్కెట్‌ను పునరుద్ధరిస్తామన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయానికి స్థల సేకరణ, నిధులు కేటాయింపు జరిగిందన్నారు. 20 ఏళ్ల క్రితం మండల కేంద్రంలో అన్ని రకాలుగా నవాబుపేటలో సంత జరిగేదన్నారు. పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, లింగం, బలరాం, మహేందర్‌రెడ్డి, వెంకటేశం, అంజయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు రూ.3 కోట్లు మంజూరు

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లోని పలు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మాణానికిగాను నిధులు మంజూరయ్యాయి. మండలంలో 60 రోడ్ల పనులకు గాను రూ.3 కోట్లు నిధులు కేటాయించారు. అయితే వీటిని మార్చి 31 వరకు పూర్తి చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో పనులు పూర్తి చేయడం అనుమానంగానే కనిపిస్తుంది.

అధికారులపై ఒత్తిడి

పనులు సకాలంలో పూర్తికాకపోతే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. దీంతో స్థానిక నాయకులు పనులు పూర్తి చేయాలని అధికారులపై ఒత్తిడి చేయనున్నారు. నిబంధనల ప్రకారం ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయనట్లయితే నిధులను మళ్లీ ఖర్చు చేయడానికి వీలు ఉండదు. దీంతో ఇప్పటినుంచే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలానికి మంజూరైన 60 సీసీ రోడ్లు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులు పూర్తయితే ఎస్సీ కాలనీల్లో రోడ్లు బాగుపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తాండూరు టౌన్: చిలుకూరు బాలాజీ దేవస్థాన ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నట్లు పలు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రామరాజ్యం పేరుతో అర్చకుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లౌకికవాది, ప్రజాస్వామ్యవాదైన రంగరాజన్‌పై రౌడీమూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు చంద్రయ్య, గోపాలకృష్ణ, శేఖర్ తదితరులు తెలిపారు.

విధుల్లో గందరగోళం


విధుల కేటాయింపుపై వినతిపత్రం ఎంపీడీఓకు ఇస్తున్న ఉపాధ్యాయులు

- ఒకే పాఠశాల నుంచి ఉపాధ్యాయులందరికీ శిక్షణ అంటూ సమాచారం
- అధిక సిబ్బంది ఉన్న బడిలో ఒకరిద్దరికి మాత్రమే విధుల కేటాయింపు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గురువులు

యాలాల: స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్త ప్రక్రియలో భాగంగా స్టేజీ-1, స్టేజీ-2 అధికారుల కేటాయింపు ప్రక్రియపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారులు నిర్లక్ష్యంగా విధులు కేటాయించారని ఉపాధ్యాయ సంఘ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎంపీడీఓకు మంగళవారం వినతిపత్రం సైతం అందించారు. శాస్త్రీయంగా ఎన్నికల విధులను కేటాయించాలని కోరారు.

అందరికీ పిలుపు

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ పుష్పలీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అయితే బెన్నూరు ఉన్నత పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా, స్టేజీ-1, స్టేజీ-2 అధికారులుగా కేటాయించి పాఠశాల నుంచి అందరూ శిక్షణకు రావాల్సిందిగా సమాచారం అందించారు. ఒకే పాఠశాలకు చెందిన అందరిని పిలిస్తే పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు యాలాల మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సుమారు 20 మంది బోధన సిబ్బంది ఉండగా, అందులో ఒక్కరిని మాత్రమే ఎన్నికల విధులకు కేటాయించి, శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని మండల పరిషత్ అధికారులు సమాచారం ఇచ్చారు. ఇలా మండల పరిషత్ అధికారులు ఉపాధ్యాయుల ఎన్నికల విధులు, శిక్షణ కార్యక్రమాల కేటాయింపు విషయంలో నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుందని పలువురు మండిపడుతున్నారు.


యాలాల మండల పరిషత్ కార్యాలయం

తీవ్ర అసంతృప్తి

దీంతో పాటు ఒకే ఉపాధ్యాయుడికి స్టేజీ-1, స్టేజీ-2 విధులను కేటాయించడం పట్ల తీవ్ర అసంతృప్తిని ఉపాధ్యాయులు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల నిర్వహణలో భాగంగా ఎన్నో జాగ్రత్తలు, పరిశీలనలు చేయకుండానే యాలాల ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉపాధ్యాయులకు ఎన్నికల కేటాయింపులు చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పలువురు ఉపాధ్యాయులకు ఆరోగ్య సమస్యలు, మహిళ ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకోకుండానే విధులు కేటాయించారని ఆరోపిస్తున్నారు. కాగా కొందరు ఉపాధ్యాయులు ఎన్నికల విధులు చేయడానికి ఆసక్తి ఉన్నప్పటికీ, వారిని కాకుండా ఎలాగంటే అలా హడావుడిగా కేటాయింపులు చేశారని మండిపడుతున్నారు. ఈ విషయంలో ఎంపీడీఓ కార్యాలయ పనితీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీనియర్లను విస్మరించారు



బొంరాస్‌పేట: త్వరలో జరగనున్న ఎన్నికల విధుల్లో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు, స్టేజ్1, స్టేజ్2 అధికారులుగా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలను విస్మరించారని టీఎస్ యూటీఎఫ్ నాయకులు మంగళవారం ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు. తమని విస్మరించి జూనియర్ ఉపాధ్యాయులకు శిక్షణకు తీసుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, వివిధ సంఘాల నాయకురాళ్లు లక్ష్మి, పరమేశ్వరి, శ్రీహరి, కాశీపతి తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ దృష్టికి తీసుకెళ్తాం



మండల విద్యాధికారి పదవీ విరమణ చేయడంతో పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సమాచారం మాకు పూర్తిగా రాలేదు. ఒకే పాఠశాల నుంచి అందరికి విధులు కేటాయించిన విషయంలో పునరాలోచించి తగిన మార్పులు చేస్తాం. ఎన్నికల విధులకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల నుంచి సమాచారం సేకరించి విధులు కేటాయించేలా చూస్తాం. మరిన్ని సమస్యల విషయంలో జిల్లా కలెక్టర్, డీపీఓ దృష్టికి తీసుకెళ్లి మార్పులు చేర్పులు చేస్తాం.

– పుష్పలీల, ఎంపీడీఓ, యాలాల

ఎన్నికల్లో ఆర్‌ఓల పాత్ర కీలకం

- తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- స్థానిక సంస్థల పోరుకు శిక్షణ కార్యక్రమం


శిక్షణలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్‌ఓ(రిటర్నింగ్ అధికారి) కీలకమని తాండూరు డివిజన్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో తాండూరు, బషీరాబాద్, యాలాల, పెద్దేముల్ మండలాలకు సంబంధించిన ఉపాధ్యాయులలకు(ఆర్‌ఓ, ఏఆర్‌ఓ) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రక్రియను సబ్ కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో రిటర్నింగ్ అధికారి సమర్థవంతంగా పని చేయాల్సి ఉంటుందన్నారు. కొన్ని విషయాల్లో సమయస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత నామినేషన్ స్వీకరించుట, పరిశీలన, తిరస్కరించడం, చెల్లుబాటు అయిన అభ్యర్థుల జాబితాను ప్రదర్శించాలని తెలిపారు. ఏదైన అభ్యర్థి నామినేషన్ తిరస్కరిస్తే దానికి సంబంధించి సంక్షిప్తంగా కారణాలు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్షన్ నిర్వహణల్లో ఆర్‌ఓలు కిందిస్థాయి సిబ్బందితో సమన్వయంగా ఉండి పనులు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ట్రైనర్ రాములు, పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం, ఏఈ నందిని, ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం మృత్యుంజయస్వామి, వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాలు ఇవే

సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి మండలంలో 10 నామినేషన్ క్లస్టర్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. రెండు, మూడు గ్రామాలకు సంబంధించి ఒకేచోట నామినేషన్ వేయాల్సి ఉందన్నారు. ఇందులో కోటబాసుపల్లి, మల్కాపూర్, జినుగుర్తి, సిరిగిరిపేట్, బెల్కటూర్, గౌతపూర్, చెంగోల్, అంతారం, నారాయణపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఆర్‌ఓలు ఆయా గ్రామాలకు సంబంధించి అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారని చెప్పారు. ఒక్కో క్లస్టర్ కింద మూడు గ్రామాలు ఉంటాయన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి


వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: మల్టీ స్పెషలిస్టుల పేరుతో కొనసాగుతున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్ కోరారు. అనుమతులు, సౌకర్యాలు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాతో పాటు పరిగిలో ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టానుసారంగా పుట్టుకొస్తున్నాయన్నారు. రోగులనే టార్గెట్ చేస్తూ చికిత్సల పేరుతో రూ.లక్షల్లో వసూలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అంతే కాకా ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేకుండా నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షల పేరుతో లేని రోగం ఉందని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. నిత్యం ఆస్పత్రుల్లో సరైన చికిత్స అందించకపోవడంతో అమాయక ప్రజలు బలవుతున్నారన్నారు. అధికారులు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీలు చేసి అనుమతులు లేని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రాములు, యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సోఫా రిపేర్ షాపులో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న సోఫా రిపేర్ షాపు


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

తాండూరు టౌన్: సోఫా రిపేర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. ఈఘటన మంగళవారం తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి రోడ్డు మార్గంలోని తానియా సోఫా రిపేర్ అండ్ రెగ్జిన్ వర్క్స్ షాపులో చోటుచేసుకుంది. ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి తెలిపిన వివరాల ప్రకారం.. సోఫా రిపేర్ షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించినట్లు వచ్చిన సమాచారంతో ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుంది. 20 నిమిషాల వ్యవధిలో చూస్తుండగానే మంటలు షాపును పూర్తిగా దగ్ధం చేశాయి. రెగ్జిన్ ఎక్కువగా ఉండటంతో మంటలు ఉవ్వెత్తున లేచాయి. దీంతో ఫైర్ ఇంజన్ రెండోసారి నీటితో మంటలను అదుపులోకి తీసుకురావాల్సి వచ్చింది. సుమారు రూ.4లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్‌సిబ్బంది అంచనా వేశారు. పక్కనే ఓ ప్రైవేటు స్కూల్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వెంటనే అక్కడి నుంచి తరలించారు. షాపు యజమాని చెత్త చెదారాన్ని తగలబెట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తుండగా, షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగినట్లు షాపు యజమాని చెబుతున్నారు. అయితే అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఆలస్యంగా ఘటనా స్థలానికి చేరుకున్నారని స్థానికులు ఆరోపించారు. అలాంటిదేమీ లేదని, మంటలు పెద్ద ఎత్తున విస్తరించిన తర్వాత సమాచారం ఇచ్చారని, అప్పటికే షాపు పూర్తిగా దగ్ధం కాగా, ఫైరింజన్‌తో రెండుసార్లు నీళ్ల చల్లి మంటలను అదుపులోకి తెచ్చినట్లు ఫైర్ సిబ్బంది చెప్పారు.

రేపటి నుంచి ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు

కుల్కచర్ల: ఈ నెల 13వ తేదీ నుంచి సేవాలాల్, మరియమ్మయాడి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సేవాలాల్, మరియమ్మయాడి ఆలయ ప్రారంభోత్సవ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బెల్టు షాపును తొలగించండి

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామంలోని పాఠశాల సమీపంలో ఉన్న బెల్టు షాపును తొలగించాలని మాజీ సర్పంచ్ సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉద్యోగుల ఐటీ, ఫారం-16 సమస్యలు పరిష్కరించండి


సంఘ డైరీని ఆవిష్కరిస్తున్న సీటీఓ వెంకటరమణ

యాలాల: ప్రభుత్వ ఉద్యోగుల ఐటీ, ఫారం-16 సమ్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తాండూరు సీటీఓ(చీఫ్ ట్రెజరీ ఆఫీసర్) వెంకటరమణను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు సంఘ సభ్యులతో కలిసి సీటీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. సీటీఓ సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణయ్య, జీహెచ్‌ఎం సుధాకర్, సంగమేశ్వర్, విజయ్‌కుమార్, రాంచందర్, నెహ్రూచౌహాన్, షఫీ తదితరులు ఉన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

అనంతగిరి: బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా గంగారంకు చెందిన శాలిని(18) హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఆమె కొంత కాలంగా తల నొప్పితో బాధపడుతోంది. ఇటీవల తల్లిదండ్రులు ఆమెను ఇంటికి తీసుకు వచ్చి వైద్యం చేయిస్తున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు సమాచారం లేదని సీఐ భీంకుమార్ తెలిపారు.


బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

అమ్మా.. సల్లంగ చూడు

ఓగిపూర్‌లో రక్త మైసమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం


జాతరలో పాల్గొన్న భక్తులు

తాండూరు రూరల్: మైసమ్మ తల్లీ సల్లంగా చూడమ్మ అంటూ గ్రామస్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ఓగిపూర్ గ్రామంలో రక్త మైసమ్మ దేవాలయం తృతీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు, డోలు వాయిద్యాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. అన్న సంతర్పణ చేపట్టారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బోనాల జాతరలో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి బృందంతో పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి జీవితఖైదు

మర్పల్లి: పాత కక్షల నేపథ్యంలో ఒకరిని దారుణంగా హత్య చేసిన నిందితులను జిల్లా సెషన్స్ కోర్టు కటకటాల పాలు చేసింది. జరిమానాతో పాటు జీవితఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఘణాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల సంగమ్మ కుమారుడైన సురేశ్‌ను 2014లో అదే గ్రామానికి చెందిన పట్లోళ్ల శ్రీను, పట్లోళ్ల మల్లేశం, సలీం, శివయ్య ఇంట్లోకి చొరబడి దారుణంగా హత్య చేశారు. పాత కక్షల నేపథ్యంలో తన కుమారుడిని మట్టుబెట్టారని సంగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ కేసు నమోదు చేయగా మోమిన్‌పేట్ సీఐ ఏవీ రంగా కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ కాలం వాదనలు జరిగాయి. ఈ మేరకు మంగళవారం డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి తీర్పు వెల్లడించారు. శ్రీనివాస్, మల్లేశం, సలీం, శివయ్యలను దోషులుగా గుర్తించి జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పీపీలు సుధాకర్‌రెడ్డి, వి.రవికుమార్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

చేవెళ్ల: జన్మదిన వేడుకలకు వెళ్లిన ఓ వ్యక్తి ఫిట్స్‌తో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి అంతారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జన్మదిన వేడుకలను గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సోమవారం రాత్రి నిర్వహించారు. వేడుకలకు గ్రామస్తులను ఆహ్వానించటంతో అందరూ వెళ్లారు. ఇందులో బాకారపు రమేశ్(30) ఉన్నాడు. వేడుకలు కొనసాగుతుండగా.. రమేశ్‌కు ఫిట్స్ వచ్చింది. అతన్ని చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. అతడి భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమె హాస్పిటల్‌కు వెళ్లగా.. రమేశ్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భర్తకు అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుంటాయని మృతుడి భార్య పోలీసులకు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డబుల్ ధమాకా


రెండు లేగదూడలకు జన్మనిచ్చిన ఆవు

ఒకే కాన్పులో రెండు లేగదూడలకు జన్మనిచ్చింది ఓ ఆవు. వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం పుట్టపహడ్ గ్రామానికి చెందిన రైతు గొల్ల నర్సింలుకు చెందిన గోవు మంగళవారం రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. దూడలు రెండూ ఆరోగ్యంగా ఉన్నాయి. దీంతో రైతు కుటుంబంలో సంతోషాలు వెల్లివిరిశాయి.

– కుల్కచర్ల

ప్రొద్దటూరులో విషాదం

- మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాద ఘటనలో శంకర్‌పల్లి వాసి మృతి
- ప్రయాగ్‌రాజ్ నుంచి తిరిగి వస్తుండగా ఘటన

శంకర్‌పల్లి: ఉత్తర్‌ప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకి తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లోని సిహోరా ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపైకి వ్యతిరేక దిశలో అజాగ్రత్తగా వస్తున్న ఓ లారీని హైదరాబాద్ ప్రాంతానికి చెందిన మినీ బస్సు బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మొత్తం 8మంది మృత్యువాత పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతులంతా హైదరాబాద్‌లోని నాచారం వాసులుగా నిర్ధారించారు. అయితే ఈ 8 మందిలో సురకంటి మల్లారెడ్డి(62) అనే వ్యక్తి స్వస్థలం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూరు. కొన్నేళ్ల క్రితం భార్య, తల్లి, కొడుకుతో కలిసి హైదరాబాద్ నాచారం వెళ్లి పాల వ్యాపారం చేస్తూ, అక్కడే స్థిర పడిపోయారు. బంధుమిత్రుల శుభకార్యాలకు, జాతర్లకు ప్రొద్దటూరుకు వచ్చి, ఇక్కడ ఇంట్లో కొన్ని రోజులు ఉండి వెళ్తుంటారు. వారికి గ్రామంలో పొలం సైతం ఉందని, వారి తండ్రి ప్రభాకర్‌రెడ్డి సుమారు 10ఏళ్ల పాటు సర్పంచిగా సేవలందించినట్లు గ్రామస్తులు తెలిపారు. మల్లారెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


మల్లారెడ్డి (ఫైల్)

చేపల వేటకు వెళ్లి.. చెరువులో పడి

- మృతి చెందిన వ్యక్తి
- ఇన్ముల్‌నర్వ గ్రామంలో విషాదం


రాజు (ఫైల్)


గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, పోలీసులు

కొత్తూరు: బతుకుదెరువు కోసం చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో నీటమునిగి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో వెలుగు చూసింది. సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల మేరకు.. ఫరూఖ్‌నగర్ మండలం మేళ్లగూడతండా పంచాయతీ పరిధిలోని కాళ్లతండాకు చెందిన రాజు(40) సోమవారం చేపలు పట్టేందుకు జేపీదర్గా సమీపంలోని చెరువు వద్దకు వచ్చాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కంగారు పడి చెరువు వద్దకు చేరుకున్నారు. అక్కడ గట్టుపై రాజుకు సంబంధించిన దుస్తులు, బ్యాగు, చేపల వల కనిపించాయి. అనుమానంతో విషయాన్ని పోలీసులతో పాటు స్థానికులకు తెలియజేశారు. అప్పటికే రాత్రి కావడంతో చెరువులో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం పోలీసులు అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సాయంతో వెతకగా రాజు మృతదేహం లభ్యమైంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.